జోరుగా కుల గణన సర్వే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన ప్రక్రియ జోరుగా సాగుతోంది. రెండో రోజైన శనివారం ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి సర్వే చేసి వివరాలు సేకరించారు. సర్వే జరుగుతున్న తీరును అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు. కులగణనతో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.


కొత్తూరు: పారాపురంలో కులగణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పాతపట్నం: ఇందిరమ్మ కాలనీలో చేపడుతున్న సర్వేను పరిశీలిస్తున్న వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేకాధికారి గురువులు


బూర్జ: దొంకలపర్త గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది


నరసన్నపేట పంచాయతీ పరిధి పురుషోత్తంనగర్‌లో సర్వే చేస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది


సరుబుజ్జిలి: పెద్దపాలెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో పీవీ మురళీమోహన్‌కుమార్


సారవకోటలో సర్వేలో సిబ్బంది


ఆమదాలవలస రూరల్: చీమలవలసలో కులగణనను పరిశీలిస్తున్న ఏపీఎం కూర్మారావు


ఎల్.ఎన్.పేట: కుల గణనలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

శ్రీరామ మందిరంలో ప్రత్యేక పూజలు


భజనలు చేస్తున్న భక్తులు

బూర్జ: లక్కుపురం పంచాయతీ పణుకుపర్త గ్రామంలోని శ్రీరామ మందిరంలో మేల్కొలుపు పూర్తయిన సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు కుంకుమ పూజలు చేశారు. భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో అధికారులు

బూర్జ: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని ఎంపీడీవో ఎం.రవీంద్రబాబు అన్నారు. ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కొల్లివలస గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం (బాలుర) విద్యాలయంలో శనివారం మండలస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, స్థానిక సర్పంచ్ జీడి వేణు, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఇంటింటా రామజ్యోతి వెలిగించాలి


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

సరుబుజ్జిలి: అయోధ్యలో ఈ నెల 22న రామాలయ ప్రతిష్ట జరుతున్న సందర్భంగా ఆరోజు ప్రతీ ఇంటిలో రామజ్యోతిని వెలిగించాలని సేవాసమితి జిల్లా సమన్వయకర్త కణుగుల సత్య, జిల్లాప్రచారక్ వి.మాధవ్‌జీ కోరారు. రొట్టవలస వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధార్మిక జాగరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలల్లా ప్రతిష్ట సంచిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద పండితులు మావుడూరి సుబ్రహ్మణ్యశర్మ, రామసేవకులు దన్నాన రవికుమార్, మూడడ్ల రమణ, కిల్లి లక్ష్మీగోవిందరావు, చలపాక రమణ,యడ్ల ఆనందరావు, ముకుందరావు ఉన్నారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ


వస్త్రాలు, సరుకులు అందజేస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: స్థానిక వంశధారనగర్ సమీపంలో నివసిస్తున్న నిరుపేద సంచార కుటుంబాలకు పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. సర్పంచ్ బూరల్లి శంకర్ నేతృత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కృష్ణచైతన్య ఈసందర్భంగా సూచించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చదువు ఈడు పిల్లలు ఉంటే పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాట్నూరు సాయిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పేదిరెడ్ల రాములు ఉన్నారు.

శ్రీరామ పాదుకా పూజపై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న యెరుకొల ఆవరణలో ఈ నెల 22న నిర్వహించనున్న శ్రీరామ పాదుకా పూజా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పాతపట్నం శ్రీరామ సేవా సమితి కోరారు. ఈ మేరకు శనివారం రాత్రి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి కూడలి మీదుగా వెంకటేశ్వర అలయం వరకు, అక్కడ నుంచి అల్‌అంధ్రరోడ్డు, మార్కెట్ మీదు పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం వర్తింపు


మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. దూసి గ్రామ సచివాలయం పరిధి దూసిపేట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చేకూరిన సంక్షేమాన్ని వివరించి బ్రోచర్లను అందజేశారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చిగురుపల్లి దశరథ, పార్టీ నాయకులు తిర్లంగి శ్రీనివాసరావు, బెండి జయరాం, తాండ్ర ధనుంజయరావు, గురుగుబెల్లి అప్పలనాయుడు, కణుగుల కిశోర్, బెండి గాం. దీ, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, ఏవో మోహనరావు, ఏపీఎం కూర్మారావు, ఎలక్ట్రికల్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న లక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


విన్నర్‌గా నిలిచిన కాశీబుగ్గ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ మురళి తదితరులు

కొత్తూరు: యువత క్రీడాల్లో రాణించాలని మేదర సంఘం రాష్ట్ర కోశాధికారి తెల్లి వైకుంఠరావు కోరారు. కొత్తూరుకు చెందిన సైనికుడు ఆరి నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు.. సైనికులుగా పనిచేస్తున్న గణేష్, దిలీప్‌లు తండ్రి జ్ఞాపకార్థం మేదరి యువకులతో జిల్లాస్థాయిలో ఈ నెల 18 తేదీ నుంచి మూడు రోజులు మెట్టూరు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. 12 జట్లు తలపడగా.. కాశీబుగ్గకు చెందిన జట్టు విన్నర్‌గా, పొందూరు జట్టు రన్నర్‌గా, హిరమండలం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు షీల్డ్, నగదు బహుమతులను స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ కె.మురళి, సంఘం కోశాధికారి వైకుంఠరావు టోర్నీ నిర్వాహకులు గణేష్, దీలీప్‌లు చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ మాట్లాడుతూ.. సైనికులుగా పనిచేస్తూ ఇటువంటి సామాజిక దృక్పథంతో క్రీడలు పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. మేదరి సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు అభివృద్ధి చెందాలంటే పిల్లలను చదివించాలని కోశాధికారి కోరారు. టోర్నీ నిర్వాహకులు గణేష్, దీలిప్, తల్లి కళావతిలను జిల్లా సంఘం నాయకులు దుశ్శాలువతో సత్కరించారు. జిల్లా సంఘం కార్యవర్గ సభ్యుడు ఆరి కోవిందరావు, మండల అధ్యక్షుడు ఆరి రాజారావు పాల్గొన్నారు.

జాతి ఐక్యతకు నిదర్శనం రామమందిరం

శ్రీకాకుళం కల్చరల్: భారతజాతి ఐక్యతకు అయోధ్య రామమందిరం నిదర్శనంగా నిలుస్తోందని, ప్రపంచంలోనే అత్యద్భుత కట్టడంగా రామ మందిరం నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నగరమంతా జైశ్రీరామ్ నినాదాలు, జెండాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు హరికా ప్రసాద్, వాకర్స్ సంఘాల నేతలు జి.ఇందిరాప్రసాద్, బి.వి.రవిశంకర్, ఎస్.జోగినాయుడు, డాక్టర్ ఎం.వాసుదేవాచారి, గోలి సంతోష్, ఎం.మల్లిబాబు, గోలి ఉమామహేశ్వరరరావు, గుడ్ల సత్యనారాయణ, కొంక్యాన మురళీధర్, అయ్యప్పస్వామి సన్నిధానం ప్రతినిధి పాలకొండ ప్రశాంత్, భజరంగ్ దళ్ కార్యదర్శి ఎం.రాజశేఖర్, డాక్టర్ వై.పోలినాయుడు, మహిళా కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అడపా మోహన్‌రాజ్, సింహాద్రి వేణుగోపాల్, జైశ్రీరామ్ అప్పారావు, ఐ.కె.రావు పాల్గొన్నారు.

బలగ హరేరామ మందిరం ఆధ్వర్యంలో..

అయోధ్య రామమందిర ప్రతిష్టాపనోత్సవాల సందర్భంగా ఈ నెల 22న బలగ హరేరామ మందిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులతో హనుమాన్ చాలీసా పారాయణ, దివ్య జీవన సంఘం ఆధ్వర్యంలో రామ రక్షాస్తోత్ర పారాయణ, ఇస్కాన్ భక్తులతో హరినామ సంకీర్తన, పి.గంగాధర్ మాస్టర్‌చే శ్రీరామ కథా గానం, సాయంత్రం దీపాలంకరణ నిర్వహించనున్నట్లు వివరించారు.

జేసీస్ ఆధ్వర్యంలో

అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) మెయిన్ సంస్థ ఆధ్వర్యంలో హోటల్ విజేత ఎదురుగా రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: పట్టణంలోని పలు ప్రాంతాలకు ఆదివారం మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎ.రవిసుధాకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పురపాలక సంఘ ప్రధాన నీటి సరఫరా కేంద్రమైన అలమాజీపేట వద్ద విద్యుత్ స్తంభాల నిర్వహణలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని మెట్టక్కివలస తదితర ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని.. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పాతపట్నంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు సత్యవేణి


పాతపట్నం: మండల కేంద్రం పాతపట్నం గ్రామ సచివాలయం-2లో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యురాలు సత్యవేణి ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులకు, బీపీ, సుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు, ఆశ వర్కలు, వలంటీర్లు పాల్గొన్నారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న లలితాదేవి

ఎచ్చెర్ల: కేకేనాయుడుపేట గ్రామంలోని లలితాదేవి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమావాస్య ఉత్తరపూర్తి సందర్భంగా అమ్మవారికి పాలభిషేకం, పంచామృతం, కుంకుమ పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు వంశీకుమార్, ధర్మకర్త నర్సింగరెడ్డి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి


మాట్లాడుతున్న ఎంవీఓ సంజీవరావు

టెక్కలి: డ్రైవర్లు, వాహనచోదకులు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని టెక్కలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం టెక్కలి ప్రజా రవాణా డిపోలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది బి.ఎస్.ఎస్.మూర్తి, రామారావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జూనియర్ సివిల్ జడ్జి రోషిణి


మాట్లాడుతున్న జడ్జి రోషిణి

పాతపట్నం:చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి విద్యార్థులకు సూచించారు. స్థానిక కోర్టు కూడలి వద్ద ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో పోలీస్‌శాఖ, మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఏదైనా సమస్య వచ్చినప్పుడు భయపడకుండా స్పందించి, ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. బాలికల హక్కులపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. న్యాయం ప్రతి ఒక్కరి హక్కు అన్నారు. చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని చెప్పారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను కల్పించిందన్నారు. ప్రతిఒక్కరికీ చట్టాల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శాసనపూరి మధుబాబు, ప్రిన్సిపాల్ ఎం.అంజనేయులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యు.దాలయ్య, న్యాయవాదులు బి.సత్యనారాయణ, జి.సూర్యం, ఎం.రమణ, మహిళా పోలీస్ వరలక్ష్మి పాల్గొన్నారు

నవోదయ ప్రవేశ పరీక్షకు 486 మంది హాజరు


నరసన్నపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో దాలినాయుడు


పాతపట్నం: అంబేడ్కర్ గురుకుల పాఠశాల కేంద్రంలో పరీక్షలను పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ త్రినాథరావు

నరసన్నపేట: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో చేరేందుకు మండల కేంద్రం నరసన్నపేటలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా ముగిసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మరో రెండు ప్రవేటు స్కూళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. 577 మందికిని కేటాయించగా వీరిలో 486 మంది విద్యార్థులు హాజరవ్వగా.. 91 మంది గైర్హాజర్ అయ్యారని ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు తెలిపారు.

పాతపట్నంలో 65 మంది గైర్హాజర్

పాతపట్నం: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం పొందడానికి పాతపట్నం మండల కేంద్రంలో రెండు కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. 492 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎంఈవో బి.శ్రీధర్ తెలిపారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 288 మంది విద్యార్థులకు గాను 250 మంది హాజరు కాగా, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల కేంద్రంలో 269 మందికి 242 మంది హాజరయ్యారు. 65 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు నల్ల కుమారస్వామి, వల్లభరావు, కె.త్రినాథరావు తెలిపారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు


మిరియాపల్లి వద్ద మొక్కజొన్న సాగు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది రబీలో వాణిజ్య పంటగా సాగుచేస్తున్న మొక్కజొన్న ఆశాజనకంగా ఉంది. గత ఏడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగిందని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ తెలిపారు. గత ఏడాది 500 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఈ ఏడాది వెయ్యి ఎకరాలకు పైగా సాగు చేస్తున్నట్లు వివరించారు. మండలంలోని వంశధార నదీతీర గ్రామాలైన దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, పెద్దకోట, బసవరాజుపేట, లక్ష్మీనర్సుపేట గ్రామాలతో పాటు ధనుకువాడ, స్కాట్‌పేట, మోదుగువలస తదితర గ్రామాల్లోను విస్తారంగా సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట వేసుకున్నప్పటి నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పంట ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం సాగునీటికి ఇబ్బంది లేదన్నారు.

రిమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు సత్కారం


జోగు రాజును సన్మానిస్తున్న ఆదిత్యవాకర్స్ క్లబ్ గవర్నర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రిమ్స్ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమితులైన జోగు రాజును ఆదిత్య వాకర్స్ క్లబ్ గవర్నర్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. శ్రీకాకుళం నగరంలో ఓ ప్రయివేటు భవనంలో శనివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాజు కేజీహెచ్‌లో మంచి సేవలందించి పదోన్నతిపై ఇక్కడికి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యకళాశాల పరిపాలనాధికారి పి.వెంకటసాయిమనోజ్, మన్యం జిల్లా ఫైర్ అధికారి పి.వి.ఎస్.రాజేష్, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, శర్మ, ప్రదీప్, నూకరాజు, బి.వి.ఎస్ ప్రభు, జవహార్, వడ్డాది శ్రీనివాసరావు, జి.ఆర్.జి.నాయుడు, బురిడి గౌరీశంకర్ పాల్గొన్నారు.

క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇచ్ఛాపురం/రూరల్: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం ద్వారా వందలాది మంది క్రీడాకారులకు చక్కని అవకాశం కల్పించారని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. ఇచ్ఛాపురంలోని రాజావారి మైదానంలో పదిహేను రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడా జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, ఎంపీడీఓ కె.రామారావు, కమిషనర్ ఎస్.రమేష్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పి.రాజశేఖరరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, కౌన్సిలర్ బచ్చు జగన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమ రెడ్డి, కారంగి మోహన రావు, దక్కత నూకయ్యరెడ్డి, రంగాల జానీ, బుడ్డ కళ్యాణ్, పీడీ పద్మనాభంరెడ్డి పాల్గొన్నారు.

మండలస్థాయి విజేతలు వీరే: కబడ్డీ(పురుషులు) బూర్జపాడు, కబడ్డీ(మహిళలు) బూర్జపాడు, ఖోఖో(పురుషులు) బూర్జపాడు, ఖోఖో(మహిళలు) రత్తకన్న, బ్యాడ్మింటన్(పురుషులు) కార్జీ వీధి, బ్యాడ్మింటన్(మహిళలు) బెల్లుపడ కాలనీ, వాలీబాల్(పురుషులు) ధర్మపురం, వాలీబాల్(మహిళలు) అరకబద్ర.